# సహగమనం

[కథానిక]

•

## శ్రీ సహజానందం

మహాంధి వేగంలో రంయ్‌మని పోతున్న చిన్న కారుకు కొట్టుకొని కిందపడ్డాడు—గుడ్డి బిచ్చగాడు. కారులో కూర్చున్న వ్యక్తిగుండె కలుక్కుమంది. వ్యాకులితంగా ఉంది అతని ముఖం. ఆందోళనతో గాద్గదికమౌతున్న గొంతుకతో 'పోనియ్యి...పోనియ్యి' అని డ్రైవరును హెచ్చరించాడు. మరింత విసురులో దూసుకొపోతోంది కారు.

రోడ్డుమీద కూలిన బిచ్చగాని తలకు తీవ్రమైన గాయాలు తగిలి, నెత్తురు ప్రవాహంగా కారుతోంది. వీధిలో ఉన్న నలుగురూ పోగయారు. గుడ్డి కనుకొలకుల్లో అశ్రువులు ఎర్రగా మెరుస్తున్నయ్. మృత్యుఘాత తిన్న అనాధుని ఆక్రందనకు ఇళ్ళల్లో వారు తలుపులు తీసుకొని గుమ్మాల్లోకి వచ్చారు.

శరవేగంలో మాయమైన కారు ఆచూకీ తెలియని ప్రేక్షకులు 'కళ్ళు లేవని ఏచెట్టునీడలోనో పడివుండక రోడ్లమధ్యన తచ్చర్లాడితే...'అని విమర్శచేశారు.

'అమ్మా...అమ్మా...' అన్న బిచ్చగాని కేకలు ప్రతిధ్వనిస్తున్నయ్. క్రమేపీ కేకలు మూల్గులౌతున్నయ్. శరీరవ్యథ తీవ్రత తగ్గుతోంది.

దారినపోతున్న వృద్ధ వైద్యుడాగి, బిచ్చగాని భిక్షాటన ముగిసిందని చెప్పి వెళ్ళిపోయాడు.

యజమానికి దూరంగా పడివుంది—కానిడబ్బుల సీనారేకుడబ్బా. పోగైన నాలుగుకాన్లూ చెదిరి పడివున్నయ్. ఆడబ్బాను, కాన్లను బిచ్చగాని సమీపంలో పెట్టి తినమీద వున్న తెల్లగుడ్డను తీసి బిచ్చగాని మీద కప్పాడు ఒకడు.

గుమికూడిన జనం క్రమేపీ ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు. రోడ్డుమీది ఇంటి కుర్రవాళ్ళిద్దరు ఈ శవాన్ని కాపలా కాస్తున్నారు. అరుగుమీద నుంచి దిగి, వీధికుక్క ఈ మృత్యుద్వారంవద్దకు వచ్చి, నిలబడ్డది.

ఈ అభాగ్యునికి చుట్టపక్కాలెవరైనా ఉన్నారా? వీని చావుబతుకులతో ఎవరికైనా సంబంధం ఉందా? ఈ విగతజీవిని రుద్రభూమికి చేర్చేభారం ఎవరిది?

పొద్దువాలే సమయం....ఓ ముసలి.....చింపిరి తల....కృశించిన కళేబరం....సందుమలుపులో అటు ఇటు చూస్తోంది...ఖాళీగా పడివున్న గోనె గుడ్డ దులిపి, దానికింద ఉన్న రెండణాలు తీసుకొని, నలువైపులా చూసింది.

శవజాగరణ చేస్తున్న కుర్రకాళ్ళలో ఒకడు కేక వేశాడు. 'నీ కొడుకు...నీ కొడుకు.'

ముసలిది ఒక్కసారి తలెత్తి, అటువైపు తిరిగి 'ఆ!'అని అఱచి, గబగబా వాళ్లున్న వైపుకు తొట్రుపడుతూ వెళ్ళింది. రెండణాలూ, గోనే రోడ్డు మధ్యలోనే జారిపడ్డయ్. 'రామా' అంటూ ఒక్కసారిగా కొడుకుమీదికి కూలింది. ఇళ్ళల్లోవారంతా బైటికి వచ్చారు. మతిచెడిన ముసలిది కళ్ళుమూసిన కొడుకు

శరీరాన్ని ఒడిలోకి తీసుకొంది. నెత్తురు మరకలు... కొలకుల్లో ఎర్రని చార చూసి ముసలిగుండె దహించుకుపోయింది.

'ఓ అభాగ్యురాలా! నీ కొడుకు లేడు...శవం మీద పడి ఏడ్చి ప్రయోజనం లేదు. కట్టెను కాటికి చేర్చాలి' అన్నాడు ఓ ముసలి. ఈ దుర్ఘటన అతని తెక్కువ కలవరపరచలేదు. దుష్టవిధియొక్క దార్లు అతనికి చిరపరిచితం. మెల్లగా శవాన్ని సమీపించి, చినుగులచొక్కా ఊడదీశాడు. ముసలి ఒక్కసారిగా శవాన్ని కౌగిలించుకుంది. ఆగిపోయిన గుండెను హోరెత్తుతున్న తన గుండెకు హత్తుకొని, దుఃఖపరవశురాలైంది.

'పాపిష్ఠిదాన్ని...పిశాచాన్ని'...నాతల పగలకొట్టండి బాబూ...నాబిడ్డ పోయాక...ఈప్రపంచమెందుకు నాకు?' అని ఘోష పెట్టింది.

బిడ్డ! గుడ్డివాడు! ముష్టివాడు! ఓ వృద్ధమాతకు అతనే సర్వం! ఓ అభాగినీ! మనుష్యుడూ, దైవమూ కూడా నీకన్నీటిలో జలక్రీడలాడుతున్నా, నువ్వు నీ అమూల్యసంపదను కోల్పోలేదు. ఆకలితో, సంక్షోభతో మగ్గి, మసి అయ్యే ఈ'భిక్షాపాత్ర'ల్లో ఈ అమృతం ఇంకా ఇంకిపోకుండా ఉందా? చినుగుల బొంతలచీర! దుమ్ముకొట్టుకున్న శరీరం! వికారమైన ముఖం! సంస్కారంలేని జీవితం! ఇట్టిశిథిలగృహంలో కూడా ఈదీపం ఇంకా ఆరిపోలేదు.

పొద్దు కుంకనన్నది...ఏడ్చి ఏడ్చి ముసలిగొంతుక బొంగురుపోయింది. చండాలు వకూలైనయ్...ఓ చిన్న పాడె పట్టారు...ప్రేక్షకుల్లోంచి ఎవరో నలుగురు ముందుకువచ్చి, మృత్యుభారాన్ని మోయటానికి సిద్ధపడ్డారు.

పడమట పర్వతశిఖరాగ్రాలపై నిలబడి సూర్యుడీ జీవన్మరణయాతనను చూస్తున్నాడు. శవ-బంధువులు రుద్రభూమి చేరుతున్నారు.

దాపున నది హోరు వినబడుతోంది. చితుల అఖరిమంటలు తగ్గుతూ తగ్గుతూ మండుతున్నాయ్.

ముసల్ది రుద్రభూమిలో అడుగుపెట్టింది. మొదటిసారి చితులమధ్య నిలబడటం! చైతన్యం బండబారి పాడెవద్ద కూలబడి కూర్చుంది.

చితి పేర్చారు... ప్రచ్ఛన్న మృత్యువు మీది ఆచ్ఛాదం తొలగించారు. ముసలిది కొడుకును తాకలేదు. కళ్లు చెమ్మగిలలేదు. గుండె ఎండిన తటాకంలా ఉంది. జీవితంయొక్క ఈ చివరి తీరాన ముసలి తన్నుతా మరచిపోయింది...భగ్ననావలు భస్మరాసులై కుప్పలు కుప్పలుగా పడివున్నయ్. విరామం/లేని నదీ ప్రవాహం...అవల ఆకాశంలో వెలుగు తగ్గుతోంది.

ప్రపంచమంతా చితుల మధ్య కాలిపోతున్నట్టు తోచింది ముసలికి.

పాడెమీదనుంచి శవాన్ని పట్టుకొవెళ్ళి చితికి నిప్పంటించారు. రగిలి రగిలి భగ్గుమన్నది జ్వాల...ఆ జ్వాలాదీప్తిలో బిచ్చగాని వంటిమీద నెత్తురుమరకలు మెరిసినయ్.

గుండెలో కత్తిగుచ్చుకున్నట్టయింది ముసలికి. జ్వాలలమధ్య తన బిడ్డ! నేలమీద కొరిగిపోయింది ముసలిది.

ఒకింతసేపుతర్వాత మృత్యువాహకులు వెళ్ళిపోయారు. ముసలి ఒక్కతే ఎడంగా కూలబడి చితికేసి చూస్తోంది...వెళ్లిన వాహకుల్లో ఓఅర్భకుడు వెనక్కు వచ్చి, 'ఎక్కడికి వెళ్తావు? మాతో రా!' అని అడిగాడు.

ముసలి దీప్రశ్నను మరచిపోయింది. కొంతసేపటినుంచి ముసలికి మతితప్పింది. ఈ జ్వాలలు చల్లారుతాయనీ, ఈ భ్రాంతి బూడిదె అవుతుందనీ, తర్వాత తాను తన నీడకు చేరి మళ్ళీ యథాప్రకారంగా తన బతుకుబండీని భుజాన వేసుకొని ఈడ్చాలనీ మరచిపోయింది. ఈ అర్భకుని ప్రశ్న విని ముసలి స్పృహలోకి వచ్చింది.

'నేను? నాకేం బాబూ!...ప్రపంచమంతా నాదే బాబూ...బిడ్డకే కరువైంది ప్రపంచం.'

'కాదు...మాతో...రా.'

'లేదు బాబూ...లేదు...పాపిష్టిదాన్ని.......
పూర్వజన్మలో...'

జనం వస్తున్న చప్పుడయింది.

నాలుగయిదు కార్లు వచ్చి, ఎడంగా ఆగినయ్. నిశ్శబ్దంగా ఉన్నారు జనం. గబగబా కట్టెలు చేర్చి చితిని పేర్చారు...వయస్సులో ఉన్న ఓ యువకుని కళేబరాన్ని పాడెమీదినించి పైకెత్తారు.

రగిలి, రగిలి, మళ్లీ జ్వాల భగ్గుమంది.

అర్భకుడు ముసలితో అన్నాడు—

'ఆ కారే...ఆ కారే'

ముసలి కళ్ళెత్తి చూచింది...దుఃఖభారంతో రెప్పలు కిందకు వాలినయ్. క్రోధాగ్ని కొంచెం రగుల్కొంది.

కాని మృత్యువిహారం చూస్తున్న ముసలిహృదయంలో కొత్త సంచలన మారంభమైంది. తన ఒక్కతెకే కాదు...మానవకోటి కంతకూ చుట్టుకొని ఉంది ఈ పాశం...

అర్భకుడు మళ్ళీ అన్నాడు—

'ఆ కారే...వళ్ళూ పై తెలియకుండా పరుగెత్తించారు.'

ముసలి అర్భకుని మాటలు విన్నట్లేలేదు.

అప్పుడే జ్వాలలు జిహ్వలు చాపుతున్న కొత్త చితికేసి చూస్తోంది.

ఈ అగ్నిశయ్య ఈ నాటిది కాదు. ప్రాణం తొలిసారి ఊపిరిపీల్చిన నాటినుంచి ఈ శయ్య భగ్గుమంటూనే ఉంది. తరతరాలుగా జీవరాశి ఇచట భస్మీపటల మాతోంది.

ఆ చితికి దూరంగా నిలబడి కుంగి దుఃఖిస్తున్న గుంపుకేసి చూసింది ముసలిది. నెమ్మదిగా లేచి వారి వైపుకు సాగిపోతోంది...అర్భకుడు కూడా వెంట వెళ్ళాడు.

'ఆ కారే...ఆ కారే' అన్నాడు మళ్ళీ అర్భకుడు.

దగ్గరగా నుంచున్న నలుగురిలోనుంచి ఓ నడివయస్సు మనిషి ముందుకు వచ్చి, 'అవును...మాకుర్రవానికి తీవ్రంగా ఉంది... ఆ ఆందోళనలో కారు...' అని ఇంకేమో అనబోతుండగా, అర్భకుడు అన్నాడు-

'ఆ ముష్టివాని తల్లే!'

ఆ వ్యక్తికళ్ళలో నీళ్లు నిండినయ్. ఈ దౌర్భాగ్యురాలి ఏకైక పుత్రుడు...తన ముద్దు బిడ్డ... ఇద్దరూ భస్మం అవుతున్నారు.

చినుగుల జీవి! అగర్భశ్రీమంతుడు!! ఇద్దరి హృదయాలూ నష్టానికి ఘూర్ణిల్లుతున్నయ్.

ఆ నడివయస్సు వ్యక్తికి మునిదంపతులు, దశరథుడు కళ్ళెదుట నిలబడ్డారు.

ముసలిది వణుకుతూ అతని కాళ్ళపై పడ్డది.

'ఇంకెందుకు బాబూ నా బతుకు '

కాష్ఠాగ్నికంటె, ఈ అమాయకప్రశ్న అతని మనస్సును ఎక్కువగా దహించింది.

'ఇంకెందుకు బాబూ నా బతుకు—ముష్టి బతుకు.'

దాపున నదిహోరు ప్రతిధ్వనిస్తోంది.

ఓ క్షుద్రురాలా...

ఆ తరంగఘోషలోనే

నీ సందేహనివృత్తి!

